

సిఎ ఫలితాల్లో తేజస్వికి 14వ ర్యాంక్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్నెమడుగుకు చెందిన కొత్తపేట తేజస్వి సిఎ ఫలితాలలో ఆల్ ఇండియా 14వ ర్యాంక్ సాధించారు. గురువారం విడుదలైన ఫలితాల్లో ఆమె ఉత్తమ ప్రతిభ చూపారు. వ్యవసాయ కుటుంబమైన కొత్తపేట రఘు రాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజస్విని. ఆమె సిఎ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపడంతో ఆ ఇంట సంతోషం వెల్లులిసింది. సర్పంచ్ శ్యామ లమ్మ, జ్యోతి, ఎంపిటిసి మహేష్, రామకృష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు తేజస్విని అభినందించారు.



తల్లిదండ్రులతో సిఎ 14వ ర్యాంకర్ తేజస్వి

పారదర్శకంగా ఉచిత ఇసుక పాలసీ : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని తన చాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్ని ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి, ఎంత ఇసుక లభ్యత ఉంది, నూతన ఇసుక విధానం ఏమిటి, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏమేం చర్యలు తీసుకున్నారని అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఏడు ఇసుక డిపోలు ఉన్నాయని కానీ అందులో జీరో శాతం ఇసుక ఉందని మైనింగ్ శాఖ ఏడీ వివరించారు. ప్రస్తుతం జూలై నుంచి సెప్టెంబర్ వరకు మాన్ సూన్ కాలంలో రివర్లలో మైనింగ్ చేయరాదని ప్రభుత్వం సూచించిందన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ నూతన ఇసుక విధానం అమలుపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం నిర్వహణ ఛార్జీలు వసూలుతో వినియోగదారులకు డిపోల ద్వారా ఇసుకను సరఫరా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందిన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను జిల్లాలో పటిష్టంగా అమలు పరచాలిన్నారు. ప్రభుత్వం టన్ను ఇసుక ధరను ఒక్కో రీచ్ పరిధిలో స్టాక్ పాయింట్‌కు ఒక్కొక్క ధరను నిర్ణయించిందని నిర్ణయించిన టన్ను ధరకు రవాణాచార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని నదులు, కెనాల్స్, బ్యారేజీలు, డ్యామ్‌ల పరిధిలో డీసిల్టేషన్ పాయింట్లను వెంటనే గుర్తించి ఇసుక లభ్యతపై ఫీజబిలిటీ రిపోర్టును రెండు రోజుల్లోగా సమర్పించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫీజిబిలిటీలో ఎన్విరాన్మెంటల్ నిబంధనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. డిసిల్టేషన్ పాయింట్లు గుర్తించి ఇసుక లభ్యత అందుబాటులోకి వచ్చిన పిదప ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి వాటికి అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని గనుల శాఖను ఆదేశించారు. జిల్లాలో మంజూరైన గృహాల నిర్మాణానికి ఎంత మేర ఇసుక అవసరం అవుతుందని హౌసింగ్ పీడీని కలెక్టర్ ప్రశ్నించగా అంచనాగా 43 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం అవుతుందని హౌసింగ్ పీడి పేర్కొన్నారు. ఇసుక లభ్యతపై ఫీజిబిలిటీ నివేదిక అందిన తర్వాత మళ్లీ ఒకసారి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశమై స్టాక్ పాయింట్లు ఏర్పాటు, ఎక్కడెక్కడ ఇసుక డంప్ చేయాలి, వాటి ధర తదితరాలను నిర?యించి వాటి వివరాలతో అక్కడ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో అక్కడక్కడ అక్రమంగా ఇసుక డంపులు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. అక్రమ ఇసుక డంపులు గుర్తించగానే గనుల శాఖ వెంటనే నోటీసులు జారీ చేసి వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో దాదాపు 45 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకోవడం జరిగిందని నోటీస్ పీరియడ్ ముగిసిన పిదప మార్గదర్శకాల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, మైనింగ్ శాఖ ఏడీ రవికుమార్, హౌసింగ్ పీడీ శివయ్య, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, డిపిఓ ధనలక్ష్మి, ఎస్ఇబి, రవాణా, ఇరిగేషన్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇసుక కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఇయు



రాయచోటి : జెండా ఆవిష్కరిస్తున్న ఇయు నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సమరశీల పోరాటాలకు ప్రతీక ఎంప్లాయిస్ యూనియన్ అని అన్నమయ్య జిల్లా గౌరవ అధ్యక్షులు పిఎన్‌బి రెడ్డి అన్నారు. గురువారం ఎపిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. మాజీ గ్యారేజీ కార్యదర్శి టి.ఎన్.ప్రతాప్‌రాజు చేతుల మీదుగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిఎస్‌ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయుటకు ఎంప్లాయిస్ యూనియన్ ఎంతో కృషి చేసిందన్నారు. నిరంతరం ఆర్‌టిసి కార్మికుల కోసం ఆలుపెరగని పోరాటం చేసేది ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమే అని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన జీతభత్యాలు ఇప్పించడంలో కూడా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు సేవ మరువలేనిదని పేర్కొన్నారు. అనంతరం ఎంప్లాయిస్ యూనియన్ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి జిఎం.రెడ్డి, డిపో అధ్యక్షులు ఎస్.ఎ.సమద్, డిపో ప్రచార కార్యదర్శి కె.విజయ్ కుమార్, డిపో జాయింట్ సెక్రటరీ పి.శివయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి కె.చలమారెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి మనోజ్ కుమార్, కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎఐటియూసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు, సాంబశివ డిమాండ్ చేశారు. ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని మదనపల్లె ఆర్‌టిసి-1, 2వ డిపోల్లో జెండా ఆవిష్కరణ చేసి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది రకరకాల ఒత్తిళ్లకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని, పని ఒత్తిడి తగ్గించడంతో పాటు మహిళా కండక్టర్లకు రాత్రి డ్యూటీలు వేయకూడదన్నారు. ఇతర ఉద్యోగస్తుల కంటే ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల పని పరిస్థితులు, పని వేళలు వేరుగా ఉంటాయన్న విషయాన్ని యాజమాన్యం గుర్తుపెట్టుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలతో పాటు రోడ్డు ప్రమాదాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ సిబ్బందిని ఈ హెచ్ ఎస్ నుంచి మినహాయించి పూర్వం లాగానే అన్ లిమిటెడ్ రిఫరల్ వైద్యాన్ని పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, ఎఐటియుసి మదనపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి ముభారక్, పట్టణ కార్యదర్శి తిరుమల, ఆర్టీసీ యూనియన్ అధ్యక్షులు పూల శ్రీనివాసులు సెక్రెటరీ హుస్సేన్ గ్యారేజ్ సెక్రెటరీ అంజాద్ హుస్సేన్, ఎపిజెఎసి మహిళా విభాగంలో చంద్రకళ సుగుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై కందిపప్పు, బియ్యం : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి రైతు బజార్‌లో రాయితీపై కందిపప్పు, బియ్యం ఇస్తున్నారని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి రైతుబజార్‌లో రాయితీపై కందిపప్పు, బియ్యం పంపిణీ కేంద్రాలను జెసి ప్రారంభించారు. మార్కెటింగ్ శాఖకు సంబంధించి ఇద్దరు చిరు వ్యాపారుల షాపులను కూడా ఆయన ప్రారంభించారు. రైతుబజార్‌లో ఖాళీగా ఉన్న షాపులను భర్తీ చేయుటకు రోడ్డు సైడ్ ఉన్న చిన్న చిన్న వ్యాపారులు ఎవరైనా టీ కొట్టు, డ్రై ఫ్రూట్స్, ఆయిల్ విక్రేతలు, టైలరింగ్, జనరల్ షాప్ తదితర వ్యాపారాలు చేసుకునే వారు రైతు బజార్లో షాపులు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్‌కు ఈనెల 3వ తేదీన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ముందుకు వచ్చిన 9 మంది చిరువ్యాపారులకు నామ మాత్రపు అద్దెకు రైతు బజార్లో షాపులు కేటాయించామన్నారు. దరఖాస్తు చేసు కున్న ఆరు గురికి షాపులు కేటాయించాల్సి ఉందన్నారు. వాటిని కూడా త్వరగా మంజూరు చేసి కేటాయించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మిగిలి ఉన్న షాపుల భర్తీ కొరకు ఆసక్తి కలిగిన చిరు వ్యాపారులు ఎవరైనా మాసా పేటలోని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కార్యాలయంలో తమ వివరాలతో దరఖాస్తు సమర్పించవచ్చునని తెలిపారు. అనంతరం మదనపల్లి మార్కెట్ యార్డును జెసి సందర్శించారు. ఒకే దేశం ఒకే ఉత్పత్తి అమలులో భాగంగా మార్కెట్ యార్డుకు ఉత్పత్తులు శాతం ఎంత, ఎంత మేర వస్తున్నాయి తదిత రాలను పరిశీలించి ఉత్పత్తులను రాష్ట్రం వెలుపలికి రవాణా చేయు అంశా లపై అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో రాయ చోటి ఆర్‌డిఓ రంగస్వామి, మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు, డిఎస్ఓ రఘు రాం, జిల్లా మేనేజరు శివరాం, రైస్, దాల్‌మిల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రైతుబజార్‌లో పంపిణీ కేంద్రాలను ప్రారంభిస్తున్న జెసి

'పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి'



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29, 30, 31వ తేదీల్లో రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు అన్నారు. గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌లో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో జరిగే రాష్ట్ర స్థాయి సమ్మేళన సమావేశాలలో రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నలు ఎదుర్కొంటున్నసమస్యల పైన సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యవసాయ సంక్షోభానికి మూలకారణాలను విశ్లేషించి రైతులను రుణగ్రస్తులు కాకుండా కాపాడాలని, ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే విద్యుత్ బిల్లును రద్దు చేయాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ప్రకటించాలని, కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్.నరసింహులు మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో టమోటా ఆధారిత పరిశ్రమలు, పాడి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, హంద్రీ-నీవా ప్రాజెక్టు పూర్తి చేసి రైతు పొలాలకు నీరు అందించడంతో పాటు మదనపల్లె ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎక్కువగా వర్షాధారిత పంటలే కావడం వల్ల గత మూడేళ్లు గా అతివృష్టి అనావృష్టి కారణంగా రైతాంగం నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణప్ప, సాంబశివ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి, రెడ్డి, రవి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

హౌసింగ్ రిలేటెడ్ అధికారులందరూ సమన్వయంతో పని చేసి ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించి సమయంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చమకూరి సంబధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి గృహ నిర్మాణాలపై ఎంపిడిఓలతో విసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి లే అవుట్‌లో మెటీరియల్ ఉండేటట్లు చూడాలన్నారు. ఇసుక, స్టీలు, సిమెంటు సమస్యలు లేకుండా చూడాలన్నారు. అన్నమయ్య జిల్లాలో 1123 నాన్ స్టార్టెడ్, 9748 బిబిఎల్, 19570 బిఎల్, 854 లింటల్ లెవెల్ 6135 రూఫ్ లెవెల్, 4751 ఆర్‌సి లెవెల్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్‌సి లెవెల్‌లో ఉన్న 4751 ఇళ్లను వంద రోజుల లోపల పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఒలు, మండల స్పెషల్ ఆఫీసర్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసే ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు మెటీరియల్ సకాలంలో అందజేసి వారి నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మీ పరిధిలోని లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఉన్న సమస్యలు గుర్తించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రోగ్రెస్ బాగా వస్తుందన్నారు. ఇకనుంచి హౌసింగ్ రిలేటెడ్ అధికారులందరూ వందరోజుల టార్గెట్ పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, డ్వామా పీడీ మద్దిలేటి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, తదితర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



వీధుల్లో ఉన్న చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్, రాహుల్‌రెడ్డి

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలో తాగునీరు, వీధి దీపాలు వంటి అత్యవసర సేవలు వెంటనే అందించేలా అధికారుల సమన్వయంతో సత్వర చర్యలు తీసుకోవాలని కమిషనర్ వాసుబాబు అన్నారు. గురువారం మంత్రి ఆదేశాలతో పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, రవాణా శాఖ మంత్రి సోదరుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులతో కలసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, పాత గొల్లపల్లి వంటి వెనుకబడిన ప్రాంతాల్లో అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ కాలనీ, పాతగొల్లపల్లెలో నీటి ఇంటర్ కనెక్షన్లు వెంటనే ఏర్పాటు చేసి, ప్రజలకు నీటిని అందివ్వాలని అధికా రులకు సూచించారు. 9వ వార్డు నాటికోళ్ల వీధిలో బోర్‌కి మోటార్, ట్యాంక్ అమర్చి ప్రజలకు నీటిని అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో డిఇ సుధాకర్ నాయక్, ఎఇ కృష్ణారెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'మిట్స్'లో మోడలింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం వారు 'ఫైనాన్షియల్ మోడలింగ్'పై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. హైదరాబాద్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐరాల లోకానందరెడ్డి మాట్లాడుతూ ఫైనాన్షియల్ మోడలింగ్ ముఖ్యంగా ఒక కంపెనీ యొక్క ఆర్థిక దృక్పథాన్ని నిర్మించడానికి వ్యాపార కార్యకలాపాల అంశాలను విశ్లేషించడంలో ముఖ్య ప్రాధాన్యతను కలిగి ఉన్నదన్నారు. ఒక వ్యాపారం యొక్క ఆర్థిక స్థితి, పోర్ట్‌ఫోలియో పనితీరు సంక్లిష్ట సంస్కరణను సూచించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. ఆర్థిక నష్టాలను తట్టుకోగల, ఆదాయం లేదా సంపదపై ప్రభావం చూపే ఊహించని సంఘటనల నుంచి తిరిగి పుంజుకునే సామర్థ్యాన్ని ఆర్థిక స్థితిస్థాపకత అంటారని తెలిపారు. మంచి ఆర్థిక పద్ధతులు, నిరంతర నిబద్ధతతో ఇది సాధ్యమవుతుందన్నారు. ఫైనాన్షియల్ రిసైలెన్స్ పొందడానికి అవసరమైన సూచనలను విద్యార్థులకు ఆయన వివరించడం జరిగింది. సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, డెట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి కేంద్రీకరించడం వల్ల వ్యక్తులు బలమైన ఆర్థిక పునాదిని ఏర్పాటు చేసుకోవచ్చు అని, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న వడ్డీ రేట్లు, గృహ ఖర్చులు వంటి సవాళ్ల కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక స్థితిస్థాపకత ప్రతి ఒక్కరికీ కీలకంగా మారిందని పేర్కొన్నారు. విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ గీతాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిసిడిఓను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమస్యలపై స్పందించమంటే బెదిరింపులకు పాల్పడిన జిసిడిఒ రాధను వెంటనే సస్పెండ్ చేయాలని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన టిఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతూ అనునిత్యం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వీరబల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సమస్యలు పరిష్కరిం చాలని కలెక్టర్‌ను కోరారు. పాఠశాలలోని తల్లిదండ్రులచే అందిన సమాచారం మేరకు సమస్యలపై స్పందించాలని కోరుతూ జిల్లా స్థాయి అధికారి అయిన జిసిడిఓ ను చరవాణి ద్వారా సంప్రదిస్తే అదే పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న అకౌంటెంట్ భర్తచే తనపై బెదిరింపులకు పాల్పడడం ఎక్కడి న్యాయం అని ప్రశ్నించారు. జిల్లా స్థాయి అధికారులే బెదిరింపులకు పాల్పడితే సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన చెందారు. ఎస్ఎంఎస్ నిధులు రూ.3.19 లక్షలు పాఠశాల అభివృద్ధి కొరకు మంజూరైనప్పటికీ నేటికీ ఆ నిధులు వినియోగించిన దాఖలాలు లేవని అన్నారు. నిధుల వినియోగం జాప్యం పై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అంతేకాకుండా పాఠశాలలో నేను సక్రమంగా అమలవడం లేదని, వంటకు నాణ్యమైన సరుకులు వినియోగించడం లేదని తెలిపారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని కస్తూర్బా పాఠశాల సమస్యలపై జిల్లా స్థాయి కమిటీ వేసి నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని జిసిడిఓ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలకు 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు'

ప్రజాశక్తి-పీలేరు

సిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలకు ప్రతిష్టాత్మక 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు' లభించింది. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించే వ్యక్తులు, సంస్థలకు న్యూఢిల్లీకి చెందిన ఏషియా టుడే మీడియా సంస్థ 'ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు' అందజేస్తుంది. ఈ ఏడాది విద్యా రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకుగానుఈ అవార్డుకు ఎంపిక చేశారు. బెంగళూరులో గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్, ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్యలకు కర్ణాటక మాజీ సిఎం జగదీష్ షెట్టర్, ప్రముఖ బాలీవుడ్ సినీనటుడు గుల్షన్ గ్రోవర్, ఎంపీ మంజునాథ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21 ఏళ్లుగా తమను ఆదరిస్తున్న పీలేరు, పరిసర ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన, పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా విద్యార్థులను తయారా చేసేందుకు వీలవుతుందన్నారు.



అవార్డు అందుకుంటున్న బిఎరాజు

రాజుకు పద్మ ప్రతిభ పురస్కారం

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం స్థానిక అమ్మచెరువుమిట్టలోని పావని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బిఎ రాజుకు పద్మ ప్రతిభ అవార్డు దక్కింది. ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ గురువారం తెలంగాణ రాష్ట్రం కోటిలో తమ సంస్థ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ప్రతిభ పురస్కారులను ప్రదానం చేసింది. మదనపల్లెకు చెందిన పావని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బిఎ రాజు చేపట్టిన సేవ కార్యక్రమాలను గుర్తించిన మనం ఫౌండేషన్ వార్షికోత్సవానికి ఆహ్వానించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ హీరో సుమన్ చేతుల మీదుగా రాజుకు పద్మ ప్రతిభ అవార్డును బహూకరించింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తమకు ఈ పురస్కారం అందడం చాలా సంతోషంగా ఉందని, తద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజల్లో ఉంటానంటూ తెలిపారు. తాను చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందించిన మనం ఫౌండేషన్ అధినేత చక్రవర్తికి, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

'భూ ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి'



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని కోరుతూ గురువారం మాలమహానాడు నాయకులు తహశీల్దారు కె.మహబూబ్ బాషకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరి మడుగు సుభాష్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున మాట్లాడుతూ గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గ్రామ, మండల స్థాయి నాయకులు సుమారు రూ.500 కోట్ల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపిం చారు. అర్హులైన వారి డికెటి పట్టాలు కొన్ని రద్దుచేసి రెవెన్యూ అధికారులు అనర్హులకు బదిలీ చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, డికెటి భూముల్లో ప్లాట్లు వేసిన భూములను, అసైన్డ్ భూముల ఎంపికలో భారీగా అవినీతి జరిగి ప్రభుత్వ ప్రజా అవసరాలకు పనికొచ్చే రూ.కోట్లు విలువచేసే భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రధాన రహదారుల పక్కన ఉన్న కోట్ల రూపాయల విలువచేసే నీరు కట్టు భూములు, చెరువుల ఆక్రమణ భూములు ఉన్నాయని ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, అలాగే ప్రజల భూములు కూడా అన్యాయంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పీలేరు మండలంలోని గూడరేవుపల్లి పంచాయతీలోని సర్వే నెంబర్: 200/3లో 0.53సెంట్లు, 769/2లో 5 ఎకరాలు, ప్రభుత్వ భూమి ఆక్రమణ, దొడ్డిపల్లి పంచాయతీ సర్వే నెంబర్ 468, 69లో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు వేసి అమ్మడం జరిగిందని, ఎర్రగుంటపల్లి పంచాయతీ సర్వే నెంబర్: 743/1ఎలో 0.84 సెంట్లు, 743/బి -1లో 2.25 ఎకరాలు, 743/బి -2లో 1.1ఎకరాలు, 708/3లో 2.32 ఎకరాలు, 743/ఎ-2లో 3.90 ఎకరాల భూములు మండలంలో గతంలో పనిచేసిన తహశీల్దారులు, విఆర్ఓలు, ఆర్ఐలు, సర్వేయర్లు మామూళ్లకు ఆశపడి ప్రజల కడుపు కొట్టి రాజకీయ బడా నాయకులకు కట్టబెట్టారని దుయ్యబట్టారు. జిల్లా అధికారులు స్పందించి అలాంటి వారిపై వెంటనే క్రిమినల్ కేసులు పెట్టి, వాటిని ఎస్సీ, ఎస్టీ ఇతర కులాల్లోని నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని మాల మహానాడు కమిటి తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు సీనియర్ నాయకులు కె.గట్టప్ప, మాలమహానాడు పీలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు మల్లేపల్లి రామచంద్ర, మండల ఉపాధ్యక్షులు బి.భాను ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, మండల సహాయ కార్యదర్శులు దప్పేపల్లి ఆనంద్, గుండ్లూరి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

గిరిజన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా రమాదేవి

ప్రజాశక్తి-రాయచోటి

గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా మహిళా కమిటీ జిల్లా కార్యదర్శిగా సంగడాల రమాదేవి, అన్నమయ్య జిల్లా వికలాంగుల కమిటీ జిల్లా అధ్యక్షునిగా కంప రవణయ్య, సుండుపల్లి మండలం మండల ఉపాధ్యక్షుడిగా పోలా మణియ్య వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు నాగేంద్ర నాయక్, రాష్ట్ర అధ్యక్షులు పూజారిరెడ్డి శేఖర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నాగన్న తెలిపారు. ఈ సందర్భంగా నాగేందర్ నాయక్ మాట్లాడుతూ వీరందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ గిరిజన ప్రజల కోసం, గిరిజన విద్యార్థుల కోసం, గిరిజన మహిళల కోసం, వికలాంగుల కోసం రాజీ లేని పోరాటం చేస్తాం అని తెలిపారు. కార్యక్రమం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేసి ఆంజనేయులు, రాయలసీమ ఇన్‌చార్జి పోలూరి రమేష్, సుండుపల్లి మండల అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, మండల కార్యదర్శి రాజశేఖర్ నాయక్, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.


అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని సోమవరం, వంగిమళ్ళ, గ్రామపంచాయతీల్లోని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ కె.రామచంద్రారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం పాలు, గుడ్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరు నెలలు నుంచి మూడేళ్ల పిల్లలకు, బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేసే గుడ్లు, బాలామృతంను, పాలు, కంది బేడలు, నూనె, అటుకులు, రాగిపిండి, చీక్కిలును పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం తనిఖీల్లో సిబ్బంది అటెండన్స్, మూమెంట్ రిజిస్ట్రర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూసి కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించండి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లి గ్రామపంచాయతీలోని చాకలపల్లె, కుమ్మరిపల్లె గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు తమకు పని దినాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు ఒక సంవత్సరం నుంచి ఉపాధి కూలీలని పనులే కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు అనేకసార్లు ప్రజాప్రతినిధులను అధికారులను దృష్టికి ఈ విషయం తీసుకెళ్లిన వారు పట్టించుకోలేదని అన్నారు. చాలామంది కూలీలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం ఉపాధి కూలీలకు పని కల్పించి డబ్బులు తక్కువ లేకుండా చూస్తున్నామని తెలుపుతున్నారని కానీ మా గ్రామాల్లో పనులు లేక పనుల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించాలని కోరారు. గతంలో ఈ విషయం పైన ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా స్పందించి పనులు కల్పించాలని సంబంధిత ఉపాధి ఎపిఒకు తెలి యజేశారని అన్నారు. ఇప్పటికైనా తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు.

టానిక్ అనుకుని యాసిడ్ తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


వెంకటరమణ (ఫైల్ ఫొటో)

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి టానిక్ అనుకుని యాసిడ్ తాగి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం ములకలచెరువు మండలంలో జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వేపూరి కోటకు చెందిన వెంకటరమణ(55) గత కొన్నాళ్ల క్రితం పోర్డు అనే స్వచ్ఛంద సంస్థలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై య్యాడు. ఆయాసంతో బాధపడుతూ వైద్యం చేయించుకుని ఇంటి దగ్గరే మం దు లు మింగుతున్నాడు. ఉన్నట్లుండి ఒక్కసారిగా ఆయాసం ఎక్కువ కావడంతో టా నిక్ అనుకుని యాసిడ్ తాగేసాడు. దీంతో తీవ్ర అనారోగ్యానికి గురైన వెంకట రమ ణను కుటుంబ సభ్యులు మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రికి తరలించారు. పరీ క్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెం దాడు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు రోహిత్ కుమార్, కుమార్తె పావని ఉన్నారు. ఇంటి పెద్ద అకాల మరణం చెందడంతో కుటుంబం వీధిన పడా ల్సి వచ్చింది. ప్రభుత్వమే ఆదుకోవాలని బంధువులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రిపుల్ఐటికి ఎంపికైన నిమ్మనపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి


ఎస్.శ్రావ్య


కె.శ్రావణి

ట్రిపుల్ఐటికి నిమ్మనపల్లి జడ్పి హైస్కూల్ (తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అంజాద్అలీఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) నుంచి ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన ఎస్.శ్రావ్య, కె.శ్రావణి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ఐటిలో సీట్లను సాధించినట్లు తెలిపారు. ఇడుపులపాయలోని ఐఐఐటికి ఎస్.శ్రావ్య, కె.శ్రావణి ఎంపికయ్యారని తెలిపారు. త్రిపుల్ఐటిలో సీట్లను సాధించి తమ పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధనలో సహకరించిన, విద్యార్థులను ప్రోత్స హించిన ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.

సొంత ఖర్చులతో ట్రాన్స్ఫార్మర్కు మరమ్మతులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల పరిధిలోని చౌటుపల్లి గ్రామపంచాయతీ దళితవాడలో ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయి మూడు వారాలపాటు నీటి సమస్య ఏర్పడితే గ్రామ పంచాయతీ అధికారులు కానీ ప్రజాప్రతినిధులు గాని ఎవరు పట్టించుకోలేద గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా గ్రామపంచాయతీలో నిధులు లేవని, చేసిన పనులకే బిల్లులు రాలేదని చెప్పారని అన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ట్రాన్స్ఫార్మర్కు మరమ్మతులు చేయించుకొని తామే ఏర్పాటు చేసుకున్నామని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గ అధ్యక్షులు అనంతపురం హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా ఉండే గ్రామపంచాయతీ వ్యవస్థలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిం చాలని కోరారు.కార్యక్రమంలో సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


టిడిపి కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో టిడిపి కార్యకర్తను గురువారం తంబళ్లపల్లె టిడిపి నేత జయచంద్రారెడ్డి పరామర్శించారు. ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లికి పంచాయతీ, దారంవారిపల్లికి చెందిన టిడిపి బిసిసెల్ నాయకుడు శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నేత జయచంద్రారెడ్డి శ్రీనివాసులు స్వగృహానికి చేరుకొని రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం శ్రీనివాసులుకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి ఏ కష్టం వచ్చిన వారికి ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంత్రి గిరిధర్రెడ్డి, మస్తాన్రెడ్డి, ప్రసాద్రెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలి

ప్రజాశక్తి-పుల్లంపేట


మహిళా కానిస్టేబుళ్ళకు సూచనలు ఇస్తున్న సిఐ

మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్లో గురువారం రాజంపేట రూరల్ సిఐ మంజునాథరెడ్డి, స్థానిక ఎస్ఐ రఘురాం ఆధ్వర్యంలో మండలంలోని మహిళ కానిస్టేబుళ్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భం గా సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తే నిఘా ఉంచి తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బెల్ట్షాపులు నిర్వహణపై విచారణ చేయాలని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుకుండా చర్యలు తీసుకోవాలని మహిళా పోలీసులకు తెలిపారు. గంజాయి, గుట్కా, మట్కా, పేకాట తదితర అంశాలు మీద గ్రామాల్లో పర్యటించి మా దృష్టికి తీసుకుని వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు , స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు జనాభా నియంత్రణ కీలకం : కలెక్టర్


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జనాభా నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, పేదరిక నిర్మూలనకు జనాభా నియంత్రణ కీలకమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం రాయచోటి ప్రాంతీయ వైద్యశాలలో వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్, విద్యా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక జనాభా వల్ల వచ్చే సమస్యలు, చిన్న కుటుంబాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచ జనాభా దాదాపు 800 కోట్లు, భారత దేశ జనాభా దాదాపు 144 కోట్లు, ఆంధ్రప్రదేశ్ జనాభా 5 కోట్లకు పైగా ఉందని పేర్కొన్నారు. జనాభా పెరుగుదల వల్ల నిరుద్యోగం, ద్రవయోల్బణం పెరిగి పేదరికం పెరగడానికి అవకాశం ఉందన్నారు. జనాభా పెరుగుదలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, వారి సమీప బంధువులకు, స్నేహితులకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలు, మహిళలు జనాభా పెరుగుదలపై అవగాహన పెంచుకోవాలని, ఆడపిల్లల వివాహానికి కనీస వయస్సు 21 సంవత్సరాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జనాభా నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ మంచి పురోగతి సాధించిందని, సంతాన ఉత్పత్తి రేటును 1.6కు తగ్గించగలిగిందన్నారు. దీనిని ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, అధిక జనాభా దేశానికి భారం, బిడ్డకు బిడ్డకు ఏడం తల్లి బిడ్డకు వరం,కుటుంబ నియంత్రణ పాటిద్దాం పేదరికాన్ని దూరం చేద్దాం, చిన్న కుటుంబం ఆనందానికి మూలం వంటి నినాదాలతో ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ మహమ్మద్ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య, డిసిహెచ్ఒ డేవిడ్ సుకుమార్, రాయచోటి ప్రాం తీయ వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ :** కుటుంబ సంక్షేమమే దేశ సౌభాగ్యమని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎంవి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ జనాభా దినోత్సవం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అధిక జనాభా వల్ల అన్ని సమస్యలు మొదలవుతాయని పేర్కొన్నారు. అధిక సంతానం వలన కలిగే నష్టాలను, చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని, ఒకరు ముద్దు ఇద్దరు హద్దని, కాన్పుకు కాన్పుకు మధ్య ఎడమ ఉండాలని అప్పుడే తల్లి, బిడ్డ ఆరోగ్యం క్షేమంగా ఉంటుందని తెలిపారు. దానివల్ల జనాభా సంఖ్య తగ్గుతుందని, అధిక జనాభా వలన ఎక్కువ అనర్థాలు వస్తాయని, బాల్య వివాహాలను రూపు మాపాలని స్త్రీ , పురుషులకు వివాహ వయసు వచ్చిన అనంతరం వివాహం జరపాలని సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్యా ధికారి జవహర్ బాబుబాబు, ఎంపిహెచ్ఇఒ జి జయరామయ్య, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్నమ్మ ,హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వరరావు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, ఫార్మసిస్ట్ షరీఫ్బాషా, ల్యాబ్ టెక్నీషియన్ జమీల్ అహ్మద్ ఆరోగ్య కార్యకర్త ఎన్.వాణి, ఎంఎల్హెచ్పి, లావణ్య, ఎఫ్ఎన్ఒ అలివేలు, మం గబాయి, అటెండర్ సునీత, ఆశా కార్యకర్తలు గురుశాంత, జె.రవణమ్మ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంభంవారిపల్లి :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని కంభంవారిపల్లె మండలం గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వివిధ రకాల తాత్కాలిక, శాశ్విత కుటుంబ నియంత్రణ పద్ధతులు, వాటి సేవలు ఉచితంగా లభిస్తాయని అన్నారు. అర్హులైన దంపతులు వారికి ఇష్టమైన, సరియైన పద్ధతిని ఎంచుకొని పాటించి జనాభా నియంత్రణకు సహకరించాలని కోరారు. గర్నిమిట్ట గ్రామంలో మరియు జిల్లేళ్ళమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య రాలు డాక్టర్ సాయిశీరీష ఆధ్వర్యంలో 104 వాహన సిబ్బంది నూతనకాల్వ గ్రామంలో చిన్న కుటుంబ-చింతలు లేని కుటుంబం' 'అధిక జనాభా అనర్థాలకు మూలం' 'కుటుంబ నియంత్రణ పాటిం చండి-జనాభా పెరుగుదలను అరికట్టండి' లాంటి నినాదాలతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ అర్చన, సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్స్ రమా దేవి, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, రుక్మిణి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో గురువారం జాతీయ సేవా పథకం1,2 విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ నరసిం హులు మాట్లాడుతూ నిత్యంపెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రకృతి వనరులు పెరగడం లేదని అన్నారు. ఆహార కొరత, సహజ వనరుల లోటు, నిరుద్యోగం, అవినీతి, వాతావరణ కాలుష్యము, మొదలగునవి విప రీతంగా పెరుగుతున్నాయని విద్యార్థులకు తెలిపారు. ఎన్ఎస్ఎస్ నాగ నవీన్ మాట్లాడుతూ జనాభా పెరుగుదల నియంత్రణ అనివార్యమని చిన్న కుటుంబమే చింతలేని కుటుంబమని అన్నారు. జనాభా పెరుగుదల నేటి భావిభారత యువత మీద ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ర్యాలీ నిర్వహించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వ హించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అని, అధిక జనాభా అనర్థాలకు మూలమని మండలంలోని చింతపర్తి పిహెచ్సి డాక్టర్లు శ్రీవిద్య, జులేఖబేగం అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చింతపర్తి పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక జనాభా పెరుగుదల వలన ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సరిపోక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మానవ జాతి వైద్య, ఆరోగ్య రంగాలలో సాధించిన విజయాలవల్ల మనుషుల జీవితకాలం పెరిగిందని, అదే సమయంలో ప్రపంచ జనాభా ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిందన్నారు. జనాభా నియం త్రణకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సనా అయేషా, వైద్య సిబ్బంది సుధాకర్, ఇందిరారాణి, భానుబి పాల్గొన్నారు.

గ్రామాల్లో అతిసారపై అవగాహన


మందులను పంపిణీ చేస్తున్న ఆశా కార్యకర్త రామాంజులమ్మ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలోని సుండుపల్లి గ్రామపంచాయతీలో దిగువ గుల్లవాండ్లపల్లె గ్రామంలోని ప్రజలకు అతిసారపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఆశ కార్యకర్త రామాంజులమ్మ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి ఒఆర్ఎస్, మందులను పంపిణీ చేశారు. ప్రజలకు అవగాహనలో భాగంగా నీటి తొట్టెలు, డ్రమ్ములలో మురుగునీరు నిల్వ ఉండ కుండా ఎప్పటికప్పుడు శుభ్ర పర చుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది డయేరియా, మలేరియా, డెంగీ వంటి విష జ్వరా లు వ్యాప్తి చెందు తాయని తెలిపారు.ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అశుభ్రత వలన అనేక జబ్బులు బారిన పడే అవకాశం ఉంటుందని సూచించారు. వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించు కోవాలని సూచించారు.

చేతులు శుభ్రతతో వ్యాధులు దూరం

సుండుపల్లె : మండలంలోని వెంగమారాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఒఆర్ఎస్ గురించి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్రెడ్డి, అంగన్వాడీ కార్యకర్త బండి శ్రీదేవి, శివరాణి, సుజనలు అవగాహన కల్పించారు. ఒఆర్ఎస్ అంటే ఏమిటి, దాని ప్రయోజనమేమిటని విద్యార్థులకు వివరించి చెప్పారు. ఆహారం తీసుకునే ముందు చేతులను మట్టి లేకుండా నీటితో శుభ్రంగా కడుక్కొని ఆహారం తీసుకోవాలని సూచించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లను వేడి నీళ్ల కాంచి చల్చార్చి తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రాథమిక ఉపాధ్యాయులు ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మామిడి మొక్కను నాటుతున్న కలెక్టర్ శ్రీధర్

పండ్ల మొక్కల నిర్వహణ పనులు పక్కాగా అమలవ్వాలి

-కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-చిన్నమండెం

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం క్రింద రైతుల పొలాల్లో నాటే పండ్ల మొక్కల నిర్వహణ పనులు పక్కాగా అమలవ్వాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. గురువారం ఉదయం డ్వామా శాఖ ఆధ్వర్యంలో చిన్నమండెం మండలం మల్లూరు, బలిజ పల్లెలలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం పనుల ద్వారా ఎస్సి, ఎస్టి చిన్న, సన్న కారు రైతుల పొలాల్లో నాటే పండ్ల మొక్కల నిర్వహణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నమండెం మండలం మల్లూరు గ్రామంలో మామిడి తోట కోసం ఏర్పాటుచేసిన ఒక భూమిలో, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పనులను ఒక మామిడి చెట్టును నాటి ప్రారంభించారు. అనంతరం ఆ పనుల కోసం వచ్చిన కూలీలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎకరాకు ఎన్ని మామిడి చెట్లు వేస్తున్నారని, సబ్సిడీలో మామిడి మొక్కలు అందుతున్నాయా లేదా, కూలీలకు నిర్దిష్ట సమయంలో వేతనాలు బ్యాంకు ఖాతాలలో పడుతున్నాయా లేదా, వంటి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. కూలీలను మీకేమైనా బకాయిలు ఉన్నాయని అడగగా అందుకు కూలీలు మూడు వారాల వేతనం రావాల్సి ఉన్నా దని చెప్పారు. త్వరలోనే మీ బకాయిలు వస్తాయని కలెక్టర్ తెలపడంతో కూలీలు హర్షించారు. పని వద్ద తాగు నీరు, నీడ, గ్రామం లోని ఏఎన్ఎం సహకారంతో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స పెట్టె, వంటివి పని వద్ద ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వీలైనంత ఎక్కువమంది రైతులకు ఈ పథకం చేరేలా చర్యలు తీసుకోవాలని పిడి డ్వామా మద్దిలేటిని ఆదేశించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు. అనంతరం బలిజపల్లి గ్రామంలో ఒక మామిడి తోటలోని మామిడి చెట్లకి నీటి సరఫరా కోసం చేపడుతున్న పనులను తనిఖీ చేసి, అక్కడి కూలీలతో మాట్లాడి అధికారులకు తగు సూచనలు చేశారు.కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ,మరియు తహసిల్దారు ఆనందకుమార్, ఉపాధి హామీ పీడీ మద్దిలేటి, ఎపిడి రవికుమార్, ఎపిఒ మాధవి, సర్పంచ్ నజీర్బాషా, ఇసి సూర్యప్రకాష్రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు,కూలీలు పాల్గొన్నారు.

మల్లయ్య కొండ ఆదాయం రూ.6.79 లక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు చెల్లించిన కానుకల ద్వారా 6.79 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ రవికిరణ్కుమార్రెడ్డి, ఇఒ రమణలు తెలిపారు. గురువారం ఆలయంలో నాలుగు నెలలుగా భక్తులు చెల్లించిన కానుకలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.6,79,677లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. టీటీడీ మహిళా సేవకులు ఈ కానుకల లెక్కించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లికార్జున నాయుడు, కొండపిట్ట పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ములకలచెరువు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మొలకలచెరువు టిడిపి మండల కన్వీనర్ పాలగిరి సిద్ధ అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గురువారం మొలకలచెరువులో ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కార్మికులతో, ఇళ్ల లబ్ధిదారులు కూడా ఇసుక కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలో భాగంగా అధికారం చేపట్టిన నెల రోజుల్లో ఉచిత ఇస్తూపాల్సింది తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్ర మంలో మండల కన్వీనర్ సిద్ధ, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కేవి రవ ణ, రామానుజులు , భాస్కర్ నాయుడు, వెంకటస్వామి, చెన్నై కృష్ణ, కేశవులు, కే రెడ్డప్ప, జనసేన సుదర్శన్ , శ్రీనివాసులు రెడ్డి, పాలు రామచంద్ర, నాగేంద్ర, లక్ష్మి నారాయణ, సోమశేఖర, రెడ్డెప్ప, ప్రతాప్నాయుడు, సిద్ధయ్య, రామమూర్తి, రమేష్ నాయుడు, కుళ్ళాయప్ప నాయుడు, రమణ, రామకృష్ణ, ప్రతాప్, శీవన్న, రవి, శీన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైనచర్యలు తప్పవని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాగులు వంకలు, గుట్టలు, చెరువులు, కుంటలు ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాలలో భూ అక్రమ జరగకుండా చర్యలు తీసుకోవాలని విఆర్ఒలకు తెలిపినట్లు ఆయన అన్నారు. గ్రామాలలో నుంచి గ్రామ సచివాలయాలకు వచ్చే రైతులు, ప్రజలు తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఇప్పటికే పలు గ్రామాలనుంచి భూ ఆక్రమణ చేస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చిందని వెంటనే ఆయా గ్రామాల విఆర్ఒలు అక్రమాలు జరగకుండా చూడాలని సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుసరించి అనుమతులు అధికారుల నుంచి తీసుకోవాలని అనుమతులు తీసుకొని ఇసుక మట్టి తరలిస్తే వారిపై చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రామసముద్రం


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మండల కేంద్రం రామసముద్రంలో సచివాలయాలం-2ను ఎమ్మెల్యే షాజహాన్బాషా గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివా లయంలో రికార్డు లను, హాజరు పట్టీలను పరిశీ లించారు. ఈ సంద ర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుత విధులకు ఆటంకం కలగకుండా సచివాలయ అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు అందించడంలో జాప్యం లేకుండా చూడాలని తెలిపారు.


విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న సుధాకర్ నాయుడు

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండలం దేవలవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ. 10 వేలు విలువగల విద్యాసామగ్రిని పులిచెర్ల మండలం ఆరవ బండ్లపల్లికి చెందిన సుధాకర్నాయుడు తల్లి పద్మావతమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు అందించారు. ప్లేట్లు, నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర విద్యా సామాగ్రి అందించారు. కార్యక్రమంలో పీలేరు ఎంఇఒ లోకేశ్వర్రెడ్డి, పాఠశాల హెచ్ఎం విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయుడు సురేష్బాబు, సుధాకర్నాయుడు, సాంబశివనాయుడు సుబ్రహ్మణ్యం నాయుడు, పరంధామనాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-కలికిరి


ఉప సర్పంచ్ ఆర్.ఎల్లయ్య

కలికిరి మండలం కలికిరి మేజర్ పంచా యతీ ఉప సర్పంచ్గా 14వ వార్డు సభ్యులు ఆర్. ఎల్లయ్యను వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. గురువారం కలికిరి మేజర్ పంచాయతీలో ఇఒపిఆర్డి పరుశురాం ఆధ్వర్యంలో ఇఒవై గురు మోహన్ ఎన్నిక చేపట్టగా సభ్యులంతా చేతులెత్తి ఎల్ల య్యను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈ సంద ర్భం గా ఇఒవై గురుమోహన్ మాట్లాడుతూ కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్రెడ్డి గత నెల క్రితం మృతి చెందారు. ఉప సర్పంచ్గా ఉన్న వేంపల్లి నూరు న్నిషా తన పదవికి ఇటీవల రాజీ నామా చేయడంతో ఉప సర్పంచ్ ఎన్నిక అని వార్యమైంది. ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్లయ్యను తాత్కాలిక సర్పంచ్గా కూడా భాధ్య తలు చేపట్టడానికి ప్రతి పాద నలనలపై అధికారులకు పంపుతున్నట్లు ఇఒవై తెలి పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బషిరూన్, అల్లాబక్షు, ఖాదర్బాషా, విశ్వనాథ్, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన పీర్ల పండుగ ఉత్సవాలు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రం చిన్నమండెంలో పీర్ల పండుగ మహోత్సవాలను రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందూ-ముస్లింలు అందరూ ఐకమత్యంగా కలిసిమెలిసి మొహరం పండుగ ఉత్సవాలను జరుపుకుంటారని పేర్కొన్నారు. గురువారం బార ఇమామ్ హుసేని ఆలం పీర్లను ఏర్పాటు చేస్తారని, 12న మూడు మఖాన్ల దగ్గర అగ్నిగుండాలను తవ్వుతాదని చెప్పారు. 13న ఇమామ్ ఖాసిం పేరున గంధం ఎక్కించి అగ్నిగుండం ఎక్కిస్తారని అన్నారు. 17న సాయంత్రం నాలుగు గంటలకు మొత్తం పీర్లను మకాన్ వద్ద నుంచి సంత బజారు వరకు డప్పు వాయిద్యాలతో జల్దికి పంపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజలు కుల, మతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట మండల పరిధిలోని నూకనపల్లి, కృష్ణంపల్లి, బోటు మీద పల్లి, గోవిందం పల్లి, టీవీ ఎన్ ఆర్ పురం, టిఎన్ అగ్రహారం, అప్పయ్య రాజుపేట, ఖాదర్ పేట, చెర్లోపల్లి, అనంతసముద్రం, పుల్లారెడ్డిపల్లి, పెద్దూరు, అగ్రహారం, దాసరిపల్లి, దేవ సముద్రం, రామాపురం, ఎగువపల్లి, దక్షిణపల్లి, పచ్చా వారి పల్లి, బలిజపల్లి, తిమ్మారెడ్డిపల్లి, దండ్లో పల్లి, కేతరాజు పల్లి, తదితర గ్రామాలలో శుక్రవారం విద్యుత్కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఎఇ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి 11 కెవి లైన్లకు మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు, విద్యుత్ అధికారులకు సహకరించవలసిందిగా కోరారు.

క్రైం కార్నర్


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు

రెండు ఇసుక టిప్పర్లు స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు స్థానిక ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ బోడిబండ సమీపంలోని కాటువకాలువ నుంచి కొద్దిరోజులుగా టిప్పర్ల ద్వారా పగలు, రాత్రి వేళల్లో మదనపల్లెకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో దానిపై పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక పోలీసులు గస్తీ కాస్తుండగా బోడిబండ సమీపంలోని కట్టువ కాలువ నుంచి సుమారు రూ.50వేలు విలువ చేసే 40 టన్నుల ఇసుకను అక్రమంగా మదనపల్లెకు తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లను తహశీల్దార్ బాలాజీ రాజుకు అప్పగించడం జరిగిందన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మదనపల్లెకు చెందిన డ్రైవర్లు కేశం మధకుమార్, మండెం ఓబులేసు లను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. డ్రైవర్లతో పాటు టిప్పర్ యజమానులు అమర్నాథ్, మణిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి-గాలివీడు

గత యేడాది సెప్టంబర్ నెలలో దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్న ఆవుల శివ అలియాస్ శివాజీని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. నిందితుడు సత్యసాయి జిల్లా ఎన్పికుంటకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు ఎస్ఐ లోకేష్రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లె సమీపంలో వెంకటరాయప్ప కుమారుడు పి.సుధాకర(45) అనే వ్యక్తి నాటుసారాను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. గురువారం నాటు సారా విక్రయ స్థావరంపై పోలీసులు దాడి చేసి పి.సుధాకరను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపినట్లు చెప్పారు. మండలంలో నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.